కథ

# ఓ అమ్మ కథ

''ఊరుకో సరసూ! జరిగిందేదో జరిగిపోయింది. జరిగిపోయిన దాన్ని వెనక్కు తీసుకొచ్చే శక్తి మనిషికి లేదు. ఒకవేళ ఆ శక్తే గనుక మనిషికి ఉండి ఉంటే, అసలు పోగొట్టుకోవడమన్నదే ఉండదు. ఇది జీవితం. మనిషిని అప్పుడప్పుడూ నవ్విస్తూ, ఎప్పుడూ ఏడిపిస్తూ ఉంటుంది''

సరస్వతి నుదుటిమీద చెయ్యేసి ప్రేమగా ఓదారుస్తూ అన్నాను.

''అది కాదండి. పుట్టబోయే బిడ్డమీద చాలా ఆశలు పెట్టుకున్నాను. కానీ చివరికిలా..!'' అపై ఆమె గొంతు దుఃఖంతో పూడుకుపోవడం వల్ల భోరుమని ఏడ్వసాగింది.

''ప్లీజ్ రిలాక్స్ సరసూ! కంట్రోల్ యువర్‌సెల్ఫ్. కాంతులీనే నీ కళ్ళు అలా కన్నీళ్ళు కురిపిస్తే నేను తట్టుకోలేను. చూడు, అనుకుంటే జీవితమంత పెద్దది ఏదీ లేదు. లేదంటే దానంత చిన్నదీ లేదు. అయినా ఇప్పుడు మనమేమన్నా ముసలోళ్ళ మయ్యామా? పిల్లలు ఈ యేడు కాకుంటే వచ్చే యేడు పుడ్తారు. మనిషికి మరో పేరు ఆశాజీవి అని. నాకూ బాధగా ఉంది. కానీ ఓ ప్రక్క నువ్వయినా దక్కినందుకు ఆనందంగానూ ఉంది'' నా గొంతు గద్గదం కావడం నాకు స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

సరస్వతి మాత్రం రోదిస్తూనే ఉంది.

ఇంకా నేనక్కడే ఉంటే ఆమె అలా దుఃఖిస్తూనే ఉంటుందని అక్కడ్నుంచి లేచి వచ్చేశాను.

''సరస్వతిని ఇవాళ ఇంటికి తీసుకువెళదామనుకుంటున్నాను డాక్టర్. మీరేమంటారు?'' అని డాక్టర్ని అడిగాను.

''ఓ.కే! కాని ఆమె బిడ్డ పోయిన దుఃఖంలో ఉంది. మెంటల్‌గా అప్‌సెట్ కాకుండా చూడండి. నా ఉద్దేశ్యం ప్రకారం ఆమెను ఓ నెల రోజుల పాటు ఉండేలా వేరే ఏదైనా ఊరికి తీసుకువెళ్ళడం మంచిది. ఏదైనా అనుకోని సంఘటన జరిగి కృంగిపోతున్న మనిషికి కొంతవరకు కొత్తస్థలం గాలి, వాతావరణం మార్పు అవసరం. ఆమె మానసికంగా త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది'' అని సలహా ఇచ్చాడు డాక్టర్.

అలాగేనని డాక్టర్‌కి థాంక్స్ చెప్పి హాస్పిటల్ ఫీజులు చెల్లించి, సరస్వతిని ఇంటికి తీసుకువచ్చేసాను.

ఇంటికి తీసుకు వచ్చినప్పటి నుండి పరామర్శకని ఎవరో ఒకరు రావడం ''ఎలా జరిగిందమ్మా? అయ్యో! నీకే ఈ కష్టం రావాలా?'' అని జరిగింది మళ్ళీ సరస్వతి గుర్తొచ్చేలా చేస్తూ తమకు తెలియకుండానే సరస్వతి దుఃఖానికి కారణమౌతున్నారు.

ఇవన్నీ చూస్తుంటే డాక్టర్ సలహా ప్రకారంగా సరస్వతిని కొన్నాళ్ళు ఈ ఊరికి దూరంగా తీసుకువెళ్ళటమే మంచిదన్న నిర్ణయానికి వచ్చాను. కానీ ఎక్కడికి తీసుకువెళ్ళాలి?

హైదరాబాదుకు తీసుకువెళ్తే? అవును అదే మంచిదని అనుకుని వెంటనే టెలిఫోన్ బూత్‌కు వెళ్ళి సుధాకర్‌కి ఫోన్ చేసి విషయం చెప్పాను. జరిగిందానికి ఎంతగానో బాధపడ్డాడు సుధాకర్. ఇంత జరిగినా తనకెందుకు చెప్పలేదని చివాట్లు పెట్టి వెంటనే బయలుదేరి రమ్మని కూడా మరీ మరీ చెప్పాడు.

సుధాకర్ నా చిన్ననాటి ప్రాణ స్నేహితుడు. అతనికి సంవత్సరం క్రితమే పెళ్ళయ్యింది. ప్రస్తుతం హైదరాబాదు సెక్రటేరియట్‌లో క్లర్క్‌గా పనిచేస్తూ, నాంపల్లిలో ఫ్యామిలీతో సహా ఉంటున్నాడు.

ఇక ఏమాత్రం ఆలస్యం చేసినా సరస్వతి ఆరోగ్య రీత్యా మంచిదికాదు. అందుకే నేరుగా రైల్వేస్టేషన్‌కెళ్ళి ఆ మరుసటి రోజుకే హైదరాబాదుకు రెండు టిక్కెట్లు రిజర్వేషన్ చేయించి ఇంటికొచ్చి సరస్వతికి విషయం చెప్పాను.

''ఇప్పుడు ఈ ప్రయాణాలు ఎందుకండి? డబ్బు ఖర్చు తప్ప'' అంది సరస్వతి.

''ఎందుకంటే ఎలా సరసూ? నిన్నీ పరిస్థితుల్లో చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోంది. ఏవో కొన్నాళ్ళు అక్కడ గడిపి వచ్చేద్దాం! ఈ విధంగా అయినా నీకు కాస్త మనఃశాంతి దొరికి త్వరగా కోలుకుంటే చాలు'' ఆమెను కన్విన్స్ చేస్తూ అన్నాను.

''మీ యిష్టం'' నిర్లిప్తంగా అందామె.

అప్రయత్నంగానే నా కళ్ళు చెమర్చాయి.

మనిషికి ఏ కష్టమొచ్చినా ఇబ్బందే. భరించలేని దుఃఖాన్ని నిలువరించలేడు. ఎక్కువ సంతోషాన్ని తట్టుకోనూ లేడు. ఎటొచ్చీ ఈ రెండింటికి మధ్య నలిగేవి కళ్ళు..కన్నీళ్ళు! కన్నీళ్ళకుండే శక్తి మరి దేనికీ లేదేమో! ఎంత బాధనయినా కొద్దిపాటి కన్నీళ్ళు కడిగేస్తాయి.

★★★

తిరుపతి రైల్వేస్టేషన్.

ఒకటవ నెంబర్ ఫ్లాట్ ఫాంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ కదలడానికి సిద్ధంగా ఉంది.

''ఏమైనా కావాలా సరసు?'' సీటు ప్రక్కనే ఉన్న కిటికీ తెరుస్తూ అడిగాను.

''కాలక్షేపానికి ఏదైనా వీక్లీ తీసుకురండి చాలు'' అందామె. ఆ గొంతులో ఇంకా దుఃఖపు ఛాయలు పోలేదు.

బోగీ దిగి ఎదురుగా ఉన్న హిగ్గిన్ బాదమ్స్ బుక్‌స్టాల్‌లో మూడు ప్రముఖ వారపత్రికలు కొని తిరిగి రైలెక్కాను. అయిదు నిముషాల తరువాత రైలు కదిలింది.

అమ్మంటే..!

అనురాగాలరెమ్మ. ఏడిస్తే తనౌవుతుంది ఆడించే ఆట బొమ్మ

నిస్వార్థానికి ప్రతిరూపం..సంతోషంగా భవిష్యత్‌లోనికి సాగనంపే నేస్తం.

అయినా అమ్మంటే, అసలా పదం అంటేనే నాకు పరమ చిరాకు. ఎందుకంటే నేను అనాథగా పెరిగాను. 'నా' అని చెప్పుకునేందుకు ఒక్కరూ లేకపోవడం చేతనూ అమ్మ వొడిలోని వెచ్చదనం తెలీదు. అమ్మ ఇచ్చే కమ్మని పాలు త్రాగుతూ ఆమె మెళ్ళోని మంగళసూత్రంతో అందరిపిల్లల్లా ఆడుకోనూ లేదు.

అమ్మ ఉండీ అనాథను చేసినా, చదువుల తల్లి మాత్రం ఆదరించి అక్కున చేర్చుకుంది.

దీంతో మెరిట్ స్కాలర్‌షిప్‌లతోనే సాగింది నా చదువు సర్వస్వం కూడా. కాలేజీలో సరస్వతితో పరిచయం ఏర్పడి అది ప్రేమగా రూపాంతరం చెంది చివరికి పెళ్ళికి దారితీసింది.

సరస్వతిని చూస్తే అమ్మంటే బిడ్డ కోసం ఇంత తపిస్తోందా? ఇదే నిజం అయితే నను కన్న నా తల్లెందుకు నన్ను విసిరేసింది?

ఇవన్నీ ఆలోచించడం వల్ల నా మనసు అదోలా తయారయింది. ఆందోళనగానూ ఉంది.

కానీ నేనే డీలాపడిపోతే ఇక సరస్వతి..? అందుకే నాలో ఎంత బాధ ఉన్నా పైకి మాత్రం మామూలుగా కన్పించడానికే ప్రయత్నిస్తుంటాను. పైకి చూసేందుకు అగ్ని పర్వతం కూడా ప్రశాంతంగా ఉంటుంది.

సరస్వతి తను తల్లిని కాబోతున్నానని చెప్పిన రోజు ఎంతో సంతోషించాను. సినిమాల్లోలా ఆమెను ఎత్తుకుని గిరగిరా త్రిప్పలేదు గానీ దాదాపు అంత హడావుడీ చేసాను.

పుట్టబోయేది ఆడా? మగా? అన్న విషయం మీద పందెం కట్టుకున్నాం. ఇంకాస్త ముందుకెళ్ళి ఆడపిల్ల పుట్టే ఏ పేరు పెట్టాలి? మగపిల్లవాడైతే ఏ పేరు పెట్టాలో చర్చించుకున్నాం.

ఓ రోజు రాత్రి.

నేను, సరస్వతి భోంచేసి బెడ్ రూంలోకెళ్ళి కొద్దిసేపు కబుర్లు చెప్పుకుని నిద్రపోయాం.

దాదాపు అర్ధరాత్రయుంటుంది. ''అమ్మా!'' అంటూ సరస్వతి బాధగా చిన్నగా అరిచేసరికి మెలుకువ వచ్చి కంగారుగా ఆమె వైపు చూసాను. తను చిన్నగా అటూ ఇటూ కదులుతూంది.

''ఏమైంది సరసు?'' అని ఆమెను నావైపుకి త్రిప్పుకున్నాను.

''కడుపులో బిడ్డ కాలితో తంతోందండి'' తీపి బాధ ఆమె మాటల్లో.

''ఒరే నా పెళ్ళాన్ని తన్నే అధికారం నీకెవరిచ్చార్రా రౌడీ వెధవ..ఎన్నాళ్ళని దాక్కుంటావు? త్వరలో బయటకు రాకపోతావా..నీ సంగతి చెప్పకపోతానా?..అమ్మా!'' అని చిరుకోపం నటిస్తూ అన్నాను.

అంతే ఇద్దరం పకపకమని నవ్వుకున్నాం. ఇలా..ఎన్నో ఊసులు, ఊహలూను.

మనిషి అనుకున్నవి అనుకున్నట్టుగా జరిగితే ఇహ భగవంతుడి వంక కనీసం కన్నెత్తయినా చూడడేమో!

సరస్వతికి కాన్పు సమయంలో బిడ్డ కడుపులో అడ్డం తిరగడం, ఆపరేషన్ చేసి డాక్టర్లు బిడ్డను బయటకు తీసిన గంట తర్వాత ఆ బిడ్డ చనిపోవడమూ జరిగింది.

ఆశలన్నీ అల్లంత దూరాన నిలబడి వెక్కిరించాయి.

చిన్నపాటి కుదుపుతో ఆగిన రైలుబండీ కీచుమన్న శబ్దం నా ఆలోచనలకు అంతరాయం కల్గించడంతో కిటికీలోనించి బయటకు చూస్తే రేణిగుంట స్టేషన్లో ఆగి ఉంది రైలు.



అది రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు వాటర్‌పాయింట్. పైగా పెద్ద జంక్షన్ కూడా కావడంతో రైలు ఐదు నిముషాలు ఆగుతుందక్కడ.

కాఫీ, టీ, ఇతర తినుబండారాలు, కూల్‌డ్రింక్సు అమ్మే హాకర్స్‌తో స్టేషన్ సందడి సందడిగా ఉంది. పది నిముషాలైనా రైలుకదలక పోయేసరికి ఏమైందో కనుక్కుందామని రైలు దిగి ఎదురుగా ట్రాలీ తోసుకుంటూ వస్తున్న పోర్టర్ని అడిగా.

''బాలపల్లి స్టేషన్ అవుటర్‌లో గూడ్సు బండి పట్టాలు తప్పింది సార్! డబుల్ లైన్ కాబట్టి రైళ్ళు డౌన్‌లైన్‌లో వదులుతున్నారు. ప్రస్తుతం ఆ లైన్లో జనతా ఎక్స్‌ప్రెస్ వస్తోంది. రాయలసీమ కదలటానికి ఇంకో అరగంట పట్టొచ్చు'' అని అతను వెళ్ళిపోయాడు.

చిరాకేసింది.

ఈమధ్య రైళ్ళు పట్టాలు తప్పడం, బస్సులు నదుల్లో పడటం ఎక్కువైపోయింది. దేశ జనాభా తగ్గించేందుకు ప్రతిన బూనాయేమో?!

అలాగే మరో పావుగంట ప్లాట్‌ఫాంపై అటూ ఇటూ తిరిగి విసుగేసి తిరిగి రైలెక్కి సరస్వతి దగ్గరికెళ్ళాను.

అక్కడ కన్పించిన దృశ్యం చూసి ఆశ్చర్యానికి అతీతమైన స్థితిలో పడ్డాను.

ఏం జరుగుతోందో కొన్ని క్షణాల తర్వాతగానీ అర్థం కాలేదు.

సరస్వతి ఎవరి బిడ్డకో పాలిస్తోంది. ఆమెకు ఓ రెండడుగుల దూరంలో ఒకామె నిలుచుని ఉంది. ఎవర్ని ఏమనాలో బోధపడక నిలుచున్న ఆమె వైపు ప్రశ్నార్థకంగా చూసాను.

''నాదేం తప్పులేదయ్యా! ఈ యమ్మ దగ్గరకొచ్చి బిడ్డ పాల కోసం ఏడుస్తోంది, ధర్మం చెయ్యి తల్లీ అనడిగాను. దానికీ అమ్మగోరు కాసేపు నీ బిడ్డను నాకు ఇస్తే ఆకలి తీర్చి పది రూపాయిలు ఇస్తానంది'' అని బెదురు బెదురుగా నావైపు చూసిందామె.

గుండె గతం గోతిలో పడ్డట్టు ఫీలయి గతుక్కుమంది.

సరస్వతిని చూస్తే దుఃఖం తన్నుకొచ్చింది నాకు.

ఆమెలో అసలైన అమ్మ కన్పించింది. బ్రతుకునిచ్చి, బతుకునుకోరే అమ్మ ప్రేమకూ, అనురాగానికీ ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం?

భగవాన్!

నేను మగవాడిని అని గొప్పలు చెప్పుకునే మగాడు, ఆడదానితో పోలిస్తే ఎందులో గొప్ప? ఒక తల్లి పురిటినొప్పుల ముందు, తన వొడినే గర్భగుడి చేసి బిడ్డను కాపాడే ఆ త్యాగజీవి ముందు. జోలపాటల ముందు. తల్లి చల్లని దీవెనల ముందు.

తల్లిగా, చెల్లిగా అంతకుమించి ఇల్లాలిగా ఆమె సేవల ముందు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నని...!?

సరస్వతిని అలా చూస్తుంటే ఇన్నాళ్ళు అమ్మ అన్న పదాన్నే అసహ్యించుకున్న నాకు నా మీదే జాలివేసింది.

ఏ భాషకందని భావాలో మనసును స్పృశించగా వళ్ళంతా పులకించిపోయింది.

నా కళ్ళల్లో నిండిన కన్నీళ్ళ వల్లనేమో సరస్వతి రూపం అస్పష్టంగా కనిపిస్తోంది.

ఆమె ఇవేమీ గమనించే స్థితిలో లేదు.

ఎవరి బిడ్డనో తన బిడ్డగా భావించి క్షణకాలం దగ్గరైన మాతృత్వంలోని మధురిమను అనుభవిస్తూ, ఆ బిడ్డ చిరుపొట్టను తృప్తిగా నింపుతూ, ఆ ఆనందాన్ని ఆనందభాష్పాల ద్వారా వ్యక్తపరుస్తోంది.

సరస్వతి ముఖంలో సంతోషం, సంతృప్తి.

ఆమెను ఆ సంతోషానికి దూరం చేయటం ఇష్టం లేక అలాగే చూస్తూ ఎదురుగా కూర్చున్నాను. కన్నీళ్ళ దారిమీద కాలం హుందాగా కదిలి, కరిగిపోతోంది.

★

**లక్ష్మీభారతి రెడ్డి**